# కన్యాశుల్కము : ప్రథమాంకము

ఒకటవ స్థలము: విజయనగరంలో బొంకుల దిబ్బ

[గిరీశము ప్రవేశించును]

గిరీశ: సాయంకాలమైంది. పూటకూళ్ళమ్మకు సంతలో సామాను కొని పెడతానని నెల రోజుల కిందట ఇర వై రూపాయలు పట్టుకెళ్ళి డాన్సింగర్లు కింద ఖర్చుపెట్టాను. ఈవాళ ఉదయం పూటకూళ్ళమ్మకీ, నాకూ యుద్ధమైఁ పోయింది. బుఱ్ఱ బద్దలు కొడదామా అన్నంత కోపం వొచ్చింది గాని, పూర్రిచర్డు చెప్పినట్లు, పేషన్సు వుంటేగాని లోకంలోనెగ్గలేం. ఈలా డబ్బు లాగేస్తే ఇదివరకు యెన్ని పర్యాయములు వూర్కుంది కాదు. యిప్పుడేదో కొంచం  డాన్సింగర్లు మాట ఆచోకీ కట్టినట్టు కనబడుతుంది. ఓర్వలేని వెధవ యెవడై నా చెప్పివుంటాడు. ఉదయం కథ ఆలోచిస్తే యిటుపైని తిండి పెట్టేటట్టు కానరాదు. ఈ వూళ్ళో మరి మన పప్పు వుడకదు. ఎటు చూసినా అందరికీ బాకీలే. వెంకుపంతులుగారి కోడలికి లవ్ లెటర్ రాసినం దుకు యెప్పుడో ఒహప్పుడు సమయం కనిపెట్టి దేహశుద్ధి చేస్తారు.

Can love be controll"d by advice?
Will cupid our mothers obey?

శీఘ్రంగాయిక్కణ్ణించి బిచాణా యెత్తి వెయ్యడమే బుద్ధికి లక్షణం; గాని మధురవాణిని వదలడమంటే యేమీ మనస్కరించకుండా వున్నది.

It is women that seduce all mankind.

నేను యేమో ఉద్యోగాలూ ఊళ్ళూ యేలి తనతో వైభవం వెలిగిస్తాననే నమ్మకంతో వుంది, పూర్ క్రీచర్! యెవరా వస్తున్నది? నా ప్రియశిష్యుడు వెంకటేశ్వర్లులా వున్నాడు. యీవాళ కిస్మిస్ శలవులు యిచ్చివుం టారు. వీడి వైఖరి చూస్తే పరీక్ష ఫేలైనట్టు కనపడుతుంది. వీణ్ణి కొంచెం వోదార్చి వీడికి శలవుల్లో చదువు చెప్పేమిషమీద వీడితో వీడి వూరికి వుడాయిస్తే చాలా చిక్కులు వదుల్తాయి; అట్నుంచి నరుక్కురమ్మన్నా డు.

[వెంకటేశం ప్రవేశించును]

యేమివాయ్ మైడియర్ షేక్స్పియర్, ముఖం వేలవేసినావ్?

వెంక: యిక మీర్నాతో మాట్లాడకండి. మా మాష్టరు మీతో మాట్లాడొద్దన్నాడు. మీ సావాసం చెయడంచాత నాపరీక్ష పోయిందని అన్నారు.

గిరీ: నాన్సెన్స్. మొదట్నుంచీ నేను అనుమానిస్తూనే వున్నాను. నీ మాష్టరుకి నన్ను చూస్తే కిట్టదు. అందు చాత నిన్ను ఫెయిల్ చేశాడు గాని, లేకుంటే నువ్వేవిఁటి ఫెయిల్ కావడవేఁవిటి! అతనికీ నాకూ యెందుకు విరోధం వొచ్చిందో తెలిసిందా? అతను చెప్పేదంతా తప్పుల తడక. అది నేను న్యూసు పేపర్లో యేకేశాను. అప్పట్నుంచీ నేనంటే వాడిక్కడుపుడుకు.

వెంక: మీవల్ల నాకు ఒచ్చిందల్లా చుట్ట కాల్చడం వొక్కటే. పాఠం చెప్పమంటే యెప్పుడూ కబుర్లు చెప్పడవేఁ కాని, ఒక మారయినా ఒక ముక్క చెప్పిన పాపాన్ని పోయినారూ?

గిరీశ: డామిట్. ఇలాటి మాటలంటే నాకు కోపం వస్తుంది. ఇది బేస్ ఇన్గ్రాటిట్యూడ్, నాతో మాట్లాడ్డవేఁ ఒక ఎడ్యుకేషన్. ఆమాట కొస్తే నీకున్న లాంగ్వేజీ నీ మాష్టరుకుందీ? విడో మారియేజి విషయవై, నాచ్చి కొశ్చన్ విషయమై నీకు యెన్ని లెక్చర్లు యిచ్చాను! నా దగ్గర చదువుకున్నవాడు ఒహడూ అప్రయోజకుడు కాలేదు. పూనా డక్కన్ కాలేజీలో నేను చదువుతున్నప్పుడు ది ఇలెవెన్ కాజెస్ ఫర్ది డిజెనరేషన్ ఆఫ్ ఇండియాను గూర్చి మూడు ఘంటలు ఒక్క బిగిని లెక్చరిచ్చేసరికి ప్రొఫెసర్లు డంగయి పోయినారు. మొన్న బంగాళీవాడు ఈ వూళ్ళో లెక్చరిచ్చినప్పుడు ఒకడికైనా నోరు పెగిలిందీ? మనవాళ్ళు వుట్టి వెధవాయలోయ్, చుట్ట నేర్పినందుకు థాంక్ చెయ్యక, తప్పు పట్టుతున్నావ్? చుట్టకాల్చడం యొక్క మజా నీకు యింకా బోధపడక పోవడం చాలా ఆశ్చర్యంగా వుంది. చుట్ట కాల్చబట్టే కదా దొర్లింత గొప్పవాళ్ళయినారు. చుట్ట కాల్చని యింగ్లీషు వాణ్ణి చూశావూ? చుట్ట పంపిణీ మీదనే స్టీము యంత్రం వగయిరా తెల్లవాడు కనిపెట్టాడు. లేకపోతే వాడికి పట్టుబణ్ణా? శాస్త్రకారుడు యేవఁన్నాడో చెప్పానే.

సూత ఉవాచ:

ఖగపతి యమృతముతేగా<br>
భుగభుగ మని పొంగి చుక్క భూమిని వ్రాలెన్<br>
పొగచెట్టై జన్మించెను<br>
పొగతాగనివాడు దున్నపోతై బుట్టునూ

ఇది బృహన్నారదీయం నాలుగో ఆశ్వాసంలో వున్నది. అది అలావుణ్ణీ గాని నీ అంత తెలివైన కుఱ్ఱవాణ్ణి ఫెయిల్ చేసినందుకు నీ మాష్టరు మీద నావళ్ళు మహా మండుతోంది. ఈ మాటు వంటరిగా చూసి వక తడాఖా తీస్తాను. నువ్వు శలవుల్లో యిక్కడుంటావా, వూరికి వెళతావా?

వెంక: వెళ్ళాల్నుందిగాని, పాసుకాలేదంటే మాతండ్రి చావ కొడతాడు.